వివేకానంద డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు

ముషీరాబాద్: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సులతో పాటు కొత్తగా బీకాం, బీఎఫ్ఎస్ఐ, బీఎస్సీ హెల్త్ కేర్ మెనేజ్‌మెంట్ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభు ఒక ప్రకటనలో కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం



కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రిలో పాల్గొన్న డాక్టర్ జేఎం రెడ్డి, డా.రాంరెడ్డి

కాచిగూడ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని అపోలో ఆస్పత్రి అనెస్తియాలజీ విభాగాధిపతి డాక్టర్ జేఎం రెడ్డి అన్నారు. కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రి వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైద్యులు అందిస్తున్న సేవలను ఇటు ప్రభుత్వం అటు ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు. సాయికృష్ణ న్యూరో ఆస్పత్రి ఎండీ డాక్టర్ రాంరెడ్డి మాట్లాడుతూ.. నరాల వ్యాధులకు సంబంధించి దక్షిణ భారతదేశంలోనే తమ ఆస్పత్రి మొట్టమొదటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కాంతారెడ్డి, పీజీ రెడ్డి, టీవీ శ్రీనివాస్, ఏఆర్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సునీల్‌కు కన్నీటి వీడ్కోలు



నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర కోశాధికారి, వైష్ణవ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంత్రి సునీల్ అంత్యక్రియలు మంగళవారం అంబర్‌పేటలోని హిందూ శ్మశానవాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. అమెరికాలో ఉన్న మృతుడి సోదరుడు మంత్రి సుధీర్ మంగళవారం ఉదయం నగరానికి చేరుకున్నారు. టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి లక్ష్మీనరసింహారావు, ఉపాధ్యక్షుడు కానాల శ్యామసుందర్ రావు, ప్రతినిధులు ఆయన పార్థీవదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. సునీల్ అంత్యక్రియల్లో బంధువులు, సన్నిహితులు పెద్ద ఎత్తున పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

కాచిగూడ: సెల్‌ఫోన్ వాడొద్దని తల్లి మందలించడంతో ఓ బాలిక ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక, వెంకటేశ్వరనగర్ ప్రాంతానికి చెందిన ధరంపాల్ – వరలక్ష్మి దంపతుల కుమార్తె ఆగ తనుష (16) తరచుగా సెల్‌ఫోన్ వాడుతుండేది. దీంతో తల్లి కుమార్తెను మందలించింది. మనస్థాపానికి గురైన తనూష మంగళవారం ఉదయం 10గంటలకు ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బాలిక తల్లి వరలక్ష్మి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ మరో ప్రాంతంలో మహిళ


గీతాంజలి సైకియా (ఫైల్)

కవాడిగూడ: హిమాయత్‌నగర్ స్ట్రీట్ నం.1లో అస్సాంకు చెందిన దీపు మోని సైకియా(43), గీతాంజలి సైకియా (30) దంపతులు నివాసం ఉంటున్నారు. దీపుమోని సైకియా మెహదిపట్నంలోని ఓ గోల్డ్ షాపులోని సేల్స్‌మోన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుటున్నారు. విధులు ముగించుకొని ఈనెల 11న రాత్రి 11గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చేసరికి అతడి భార్య గీతాంజలి సైకియా కనిపించలేదు. వెంటనే దీపుమోని దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసతున్నారు.

విద్యుత్ ఎమర్జెన్సీ అధికారుల నంబర్లు

చిక్కడపల్లి: విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గినా లేదా అత్యవసర విద్యుత్ సేవల కోసం విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించవచ్చు. ఇందిరాపార్క్ ఆపరేషన్ ఏడీఈ సంపత్ పవన్ కుమార్ 87124 69892, కవాడిగూడ ఆపరేషన్ ఏఈ సమీర్ 87124 69894, గాంధీనగర్ ఆపరేషన్ ఏఈ సంతోష్ ఆనంద్ 87124 69893, అశోక్‌నగర్ ఆపరేషన్ ఏఈ శేఖర్ 87124 69895, ఇందిరాపార్క్ ఏఏఓ, ఈఆర్‌వో 87124 69875, ఇందిరాపార్క్ ఎఫ్‌ఓసీ ఆపరేటర్ 87124 69914, ఇందిరాపార్క్ ఎఫ్‌ఓసీ ఫీడర్ వర్కర్ 87124 69915, గాంధీనగర్ ఎఫ్‌ఓసీ ఆపరేటర్ 8712469916, గాంధీనగర్ ఎఫ్‌ఓసీ ఫీడర్ వర్కర్ 87124 69917.

ఇక్కడ నో ఫైర్ స్టేషన్

- అంబర్‌పేటలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు శూన్యం
- నియోజకవర్గంలో అగ్నిప్రమాదం జరిగితే పక్క ఫైర్ స్టేషన్లే ఆధారం
- దూర ప్రాంతాల నుంచి వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది
- స్థలం లేదనే సాకుతో ఏర్పాటు చేయని పాలకులు
- పోలీసు స్థలం ఉందన్న విషయాన్ని విస్మరించడం గమనార్హం
- తాత్కాలికంగా ఏర్పాటు చేసి తిరిగి తరలించిన వైనం

అగ్నిప్రమాదం జరిగితే అంతే..



అంబర్‌పేట: ఒక నియోజకవర్గం... లక్షల జనభా అగ్నిప్రమాదం జరిగితే మంటలను ఆర్పే ఫైర్ స్టేషన్ లేదు. ఇది అంబర్‌పేట నియోజకవర్గ పరిస్థితి. అంబర్‌పేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఒక ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు. చిన్న అగ్నిప్రమాదం జరిగినా సమీప ప్రాంతాల్లో ఉన్న ఫైర్ స్టేషన్లపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రమాదం జరిగినప్పుడు ఇతర ప్రాంతాల నుంచి అగ్నిమాపక వాహనం వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. అంబర్‌పేట గోల్నాక వంటి ప్రాంతాల్లో ఇప్పటికీ చిన్న చిన్న పరిశ్రమలు ఉన్నాయి. చిన్నచిన్న గల్లీలలో జనసాంద్రత ఎక్కువగా ఉంటుంది. చిన్న ప్రమాదం జరిగినా నష్టం పెద్దగా ఉంటుంది. ఇప్పటికైన అంబర్‌పేట నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కేంద్రం గోషామహల్‌కు తరలిపోయింది..

◆ అప్పుడు అంబర్‌పేట నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చేసిన ప్రయత్నాలు ఫలించినట్లేనని అందరూ భావించారు. వచ్చినట్టే వచ్చి అది కాస్త వెనక్కి వెళ్లిపోయింది. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కోసం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేశారు. కొన్ని రోజులు అగ్నిమాపక వాహనాన్ని అక్కడ నిలిపి సేవలు అందించేందుకు సిద్ధం చేశారు. కాగా అక్కడ సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు స్థలం, ఇతర సౌకర్యాలు కల్పించ లేదు. దీంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రం అక్కడి నుంచి గోషామహల్‌కు తరలిపోయింది.

అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం..

◆ నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయడానికి కావాల్సిన స్థలం లేదనే సాకుతో ఏర్పాటు చేయడం లేదు. కాగా అంబర్‌పేటలో కావాల్సిన పోలీసు విభాగం స్థలం ఉన్న విషయాన్ని విస్మరించడం గమనార్హం. పోలీసు, అగ్నిమాపక శాఖలు రెండు ఒకే మంత్రిత్వ శాఖకు కిందకు వచ్చినప్పటికీ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థలం సేకరించకపోవడం పాలకుల చిత్తశుద్ధిలేమికి నిదర్శనం. సీపీఎల్ రోడ్డులు లాఅండ్‌ఆర్డర్ పోలీసు స్టేషన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్, ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఉన్నప్పటికీ ఒక ఫైర్‌స్టేషన్ కేంద్రం ఏర్పాటుకు చొరవ తీసుకోకపోవడం శోచనీయం. ప్రభుత్వాలు, పాలకులు మారినా అంబర్‌పేటకు ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం.



ఫైరింజన్ వచ్చే వరకు ఆగాల్సిందే..

ఏర్పాటుకు నా వంతు కృషి చేస్తా..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్నాను. నా ఒత్తిడితో తాత్కలిక ఫైర్‌స్టేషన్ ఏర్పాటు అయ్యింది. దానికి కావాల్సిన వనరులు, సౌకర్యాలను ప్రస్తుత ప్రభుత్వం కల్పించలేదు. దీంతో ఇక్కడి నుంచి తరలివెళ్లిపోయింది. ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు నా వంతు కృషి చేస్తాను.

– అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఇతర ప్రాంతాల నుంచి వచ్చేసరికి...

◆ అంబర్‌పేటలో అగ్ని ప్రమాదం జరిగితే నష్టం అంచనకు మించి జరుగుతుంది. ఇక్కడ ప్రమాదం జరిగితే పక్కను ఉన్న ముషీరాబాద్, చాదర్‌ఘట్‌లో ఫైర్‌స్టేషన్లపై ఆధారపడాల్సి వస్తోంది. సంఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న అక్కడి అగ్నిమాపక సిబ్బంది అంబర్‌పేటకు వచ్చేసరికి సమయం ఎక్కువ పడుతోంది. దీంతో సకాలంలో ఆదుపులోకి తేవాల్సిన మంటలను అదుపు చేయడంలో జాప్యం జరుగుతోంది. అదే స్థానికంగా అగ్నిమాపక కేంద్రం ఉంటే ప్రమాద తీవ్రతను సకాలంలో అరికట్టే అవకాశం ఉంటుంది.

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి షేక్‌షావలి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆ శాఖ సంయుక్త కమిషనర్ ఆర్.చంద్రశేఖరంను కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్మికులకు కనీస వేతనం రూ.30,000 చేసి పీఎఫ్ పెన్షన్‌ను రూ.15వేలకు పెంచాలన్నారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. భవన ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు విధి నిర్వహణలో చనిపోతే రూ.50 లక్షలు ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీయూజీపీసీ ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, నేతలు పి.సునిత, వై.మల్లేష్ రేణుక, సునీల్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


కార్మిక శాఖ రాష్ట్ర సంయుక్త కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక నేతలు

‘శ్రీవారి వాహన వైభవం’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎస్ఆర్ ఆంజనేయ శర్మ, మేడిపల్లి వెంకట్రామశర్మ, ఆంజనేయులు

చిక్కడపల్లి: బ్రహ్మశ్రీ జిల్లెళ్ల సుబ్బరాయశాస్త్రి జయంతి కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా ‘శ్రీవారి వాహన వైభవం’పుస్తకాన్ని ఎంఎస్ఆర్ ఆంజనేయ శర్మ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. తొలుత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖులు మేడిపల్లి వెంకట్రామశర్మ, వారణాసి ఆంజనేయులు, సురభి శంకరశర్మ, జయరాం భట్టాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు, జిల్లెళ్ల వరప్రసాద్, ఇందిరా గౌరవీ భవాని, కృష్ణకిషోర్‌శాస్త్రి, చంద్రశేఖర్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విద్యాసంస్థలను పరిశీలించిన న్యాక్


న్యాక్ కమిటీ సభ్యులతో అంబేడ్కర్ న్యాయ కళాశాల యాజమాన్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాసంస్థల ద్వారా పేద విద్యార్థులకు అందుతున్న ఉన్నత విద్యను పరిశీలించడానికి మంగళవారం న్యాక్ కమిటీ సభ్యులు వెళ్లారు. దీనిలో భాగంగా న్యాక్ టీమ్ చైర్మన్‌తో పాటు ముగ్గురు సభ్యులు, కో ఆర్డినేటర్స్ లా కళాశాలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ పరిశీలనలో ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని వసతులతో విద్యను అందిస్తున్నారని న్యాక్ కమిటీ సభ్యులు నివేదిక అందించినట్లు విద్యా సంస్థల చైర్మన్ గడ్డం వివేక్ వెంకటస్వామి, కార్యదర్శి జి.వినోద్, కరస్పాండెంట్ సరోజ, జాయింట్ సెక్రటరీ రమణ, డైరెక్టర్ విష్ణుప్రియ, లా కళాశాల ప్రిన్సిపల్ సృజనలు తెలిపారు. ఈ సందర్భంగా న్యాక్ కమిటీ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీధర్‌బాబును మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

కవాడిగూడ: దళిత ఎంపీని అవమానపరిచే విధంగా వ్యవహరించిన మంత్రి శ్రీధర్‌బాబును మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని పలు మాల సంఘాలు మంగళవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్య, దేవాదాయ మున్సిపల్ కమిషనర్లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంటనే పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీఎంతో పాటు అధికారులు 48గంటల్లో స్పందించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు ఉస్తాద్‌రాజు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, దళిత సంఘాల ప్రతినిధులు బిట్ల వెంకటేశ్వర్లు, వినయకుమార్, వినోద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కలశ ఘటాభిషేకం

ముగిసిన చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయని ఆలయ ఈఓ అన్నపూర్ణ తెలిపారు. ఉదయం సుప్రభాత సేవా, బిందేతీర్థం, బాలభోగం, మంత్రపుష్పం, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11గంటలకు 81 కలశాలతో ఘటాభిషేకం చేశారు. భక్తులకు స్వామివారి పూత ఘటాభిషేక అష్టలక్ష్మ కలశాలను ఇచ్చారు. అనంతరం మహానివేదన తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి శృంగార డోలోత్సవం కనులవిందుగా సాగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు శ్రీనాథ్‌గౌడ్ దంపతులు పాల్గొన్నారు.


పూజలో భక్తులు, ఆలయ ఈఓ అన్నపూర్ణ

ఏపీఐసెట్‌లో అంబర్‌పేట యువకుడికి నాల్గో ర్యాంక్


సాయిరామ్ సాత్విక్

కాచిగూడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐసెట్ ఫలితాల్లో బాగ్ అంబర్‌పేట, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీకి చెందిన గోవిందరావు కుమారుడు సాయిరామ్ సాత్విక్ రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించి సత్తాచాటాడు. ఏపీ ఐసెట్‌లో అంబర్‌పేట యువకుడు సత్తాచాటడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరీక్ష కోసం ఎల్‌బీనగర్‌లో ఎగ్జామినేషన్ సెంటర్ ఏర్పాటు చేయగా మొత్తం 756 మంది పరీక్ష రాశారు. అందులో 742 మంది క్వాలిఫై కావడం విశేషం.

ప్రకాశ్‌కు ఓయూ డాక్టరేట్



చిక్కడపల్లి: ఓయూ జియాలజీ విభాగం నుంచి డా.ప్రకాశ్‌కు డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.ప్రభాకర్ పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా, రఘునాథపల్లి వాటర్ షెడ్‌లో భూగర్భ జలాలు, ఉపరితల జలనిర్వహణ కోసం ఇంటిగ్రేట్ రిమోట్ సెన్సింగ్ , జీఐఎస్ అధ్యాయనాలు అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. గతంలో ఆయన జల్ నిర్మల్ ప్రాజెక్టు (కర్ణాటక), రాజీవ్ గాంధీ తాగునీటి మిషన్ (ఏపీ, తెలంగాణ) పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక విభాగం అనుబంధంగా ఉన్న తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్ (టీజీఆర్ఏసీ)లో సైంటిఫిక్ ఆఫీసర్‌గా ప్రస్తుతం పని చేస్తున్నట్లు తెలిపారు. తన పరిశోధనకు సహకరించిన వారికి డా.ప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళి


టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సత్యనారాయణ మూర్తి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతిని బ్రహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాంపల్లిలోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు నైషదం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ... బ్రిటీషర్ల తుపాకికి తన గుండెను చూపించిన గొప్ప త్యాగమూర్తి ప్రకాశం పంతులు అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ వాణి, టంగుటూరి రాము, మురళీకృష్ణ, శేష సాయి, బస్వరాజు శ్రీనివాస్ తదితరులు ఉన్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థిపై దాడిపై ఖండన

ఉస్మానియా యూనివర్సిటీ: తిరుపతిలో ఈనెల 17న దళిత విద్యార్థిపై జరిగిన దాడిని ఓయూ విద్యార్థి నేతలు మంగళవారం తీవ్రంగా ఖండించారు. బీటెక్ విద్యార్థి జేమ్స్‌పై కొందరు మనువాద శక్తులు దాడి చేసి గాయపరచి మూత్ర తాగించడం హేయమైన చర్యగా తెలంగాణ రీసెర్చ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.ప్రేమ్‌కుమార్, బహుజన విద్యార్థి జేఏసీ చైర్మన్ వేల్పుల సంజయ్,ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు కొత్తపల్లి తిరుపతి, పేర్కొన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న టీపీ జేఏసీ నేతలు

చిక్కడపల్లి: రాష్ట్రంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీ జేఏసీ), ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక (ఎంఏపీఎం) సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ.. రాష్ట్ర కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీజేఏసీ కో కన్వీనర్ కన్నెగంటి రవి, రవిచందర్, నాయకులు వీరా సంఘమిత్ర, ఖలీదా పర్వీన్, పి.శంకర్, శివకుమార్, సామ్రాజ్యం, సిస్టర్ లిజీ, జయలక్ష్మి తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో దశాబ్దాలుగా కార్మికుల, ముఖ్యంగా అసంఘటిత కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. అసంఘటిత రంగంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు, శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కార్మికులు, ప్రైవేట్ రంగం సంస్థల ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా రాష్ట్ర కార్మిక శాఖను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

షాదీ ముబారక్‌తో పేద కుటుంబాల్లో వెలుగులు


షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: ఆడపిల్లల పెళ్లిళ్ల చేయలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాల్లో షాదీముబారక్ పథకం ద్వారా ప్రభుత్వం సాయం అందిస్తూ వెలుగు నింపుతోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్ మండల కార్యాలయం వద్ద కాచిగూడ ప్రాంతానికి చెందిన 8మంది అర్హులైన లబ్ధిదారులకు స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ తహసీల్దార్ డి.సంధ్యారాణి, డిప్యూటీ తహసీల్దార్ రఘు విష్ణు, ఆర్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు సెల్‌ఫోన్ దొంగల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జగన్

నల్లకుంట: జల్సాలకు అలవాటు పడి సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్న నల్లకుంట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మంగళవారం నల్లకుంట పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఓయూ ఏసీపీ జగన్, నల్లకుంట ఎస్‌హెచ్‌వో జగదీశ్వర్ రావు, అడిషనల్ సీఐ రాములు, వివరాలు వెల్లడించారు. అంబర్‌పేట పోచమ్మబస్తీకి చెందిన ప్రణీష్(22), రామకృష్ణ హట్స్‌కు చెందిన చిగర్ల సురేష్(20). బురుజుగల్లీలో ఉండే అరుణ్‌కుమార్(20) ముగ్గురు స్నేహితులు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు ముగ్గురు సెల్‌ఫోన్‌లు చోరీ చేయడం ప్రారంభించారు. ఈనెల 18న రాత్రి 12గంటల సమయంలో నల్లకుంట టీఆర్టీ కాలనీలో రఘు అనే యువకుడు తన సెల్ ఫోన్ చూస్తూ వెళ్తున్నాడు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై అటుగా వచ్చిన ముగ్గురు ఆ యువకుడి చేతిలోని ఫోన్ లాక్కుని పారిపోయారు. ఆ యువకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల్లోని ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం 8గంటల సమయంలో ముగ్గురు నిందితులు అంబర్‌పేట మహంకాళి ఆలయం సమీపంలో ఉన్నారనే సమాచారంతో నల్లకుంట క్రైమ్ పోలీసులు అక్కడికి వెళ్లి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. సెల్‌ఫోన్‌లు చోరీ చేస్తున్నట్లు అంగీకరించడంతో వారి వద్ద నుంచి ఓ ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మంగళవారం ముగ్గురిని నాంపల్లి 4వ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ముగ్గురికి రిమాండ్ విధించారు. కేసును 24 గంటల్లోనే ఛేదించిన పోలీసులను ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య అభినందించారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాల్సిందే..


కవాడిగూడలో తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకులు భరత్‌గౌడ్, రమేష్‌రామ్, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలను కూకటి వేర్లతో ఏరి వేయాల్సిందేనని... ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న ప్రధాని మోదీకి, భారత సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని మహంకాళి జిల్లా బీజేపీ నగర అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. కవాడిగూడ డివిజన్ వైస్రాయ్ చౌరస్తాలో మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రమేష్‌రామ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భరత్‌గౌడ్‌తో పాటు కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ పాల్గొని మాట్లాడారు. పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మంది ప్రాణాలు బలిగొన్నారని అన్నారు. ఉగ్రవాదాన్ని తుద ముట్టించేందుకు భారత ప్రభుత్వం ఉగ్రవాద శిబిరాలపై దాడిచేసి భారత్ సత్తా ఏమిటో చాటి చెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి. వెంకటేష్, పూసరాజు, నవీన్ గౌడ్, ఎంసీ మహేందర్ బాబు, సలంద్రి దిలీప్ యాదవ్, ఏ.ప్రభాకర్ గంగపుత్ర, మురారి శెట్టికేశవ్ తదితరులు పాల్గొన్నారు.